# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 177 | విశాఖపట్నం | 29-3-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 177 | VISAKHAPATNAM | 29-3-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




# ఇకపై రాజధాని అమరావతికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని శనివారం జరిగిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇకపై రాజధాని అమరావతికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. శాతవాహనులు అమరావతి నుంచే పాలన సాగించారని గుర్తుచేశారు. ఆ కాలం నాటి అమరావతి విశేషాలను బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలుగువారిని గతంలో 'మదరాసీలు' అని పిలిచేవారని.. టీడీపీ ఆవిర్భావం తర్వాత మదరాసీ అనే ముద్ర పోయిందని చంద్రబాబు గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. విభజన సమయంలో సమన్యాయం కోసం తాము కోరినట్లు చంద్రబాబు చెప్పారు. ఆనాడు పార్లమెంట్‌లో జగన్ కనిపించకుండా దాక్కున్నారని విమర్శించారు. విభజన తర్వాత ఏపీలో కార్యాలయాలు లేవని, బస్సులో ఉండి పరిపాలన చేశామని ఆయన వెల్లడించారు. అమరావతిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలను కేవలం 9 నెలల్లోనే పూర్తి చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సింగపూర్ సహకారంతో ఆ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరామని సీఎం తెలిపారు. 'ముందు దేశం బాగుండాలి.. అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి' అని అన్నారు. తెలుగు వాళ్లకు చెందిన హైదరాబాద్, అమరావతి తొలి రెండు స్థానాల్లో ఉండాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు. విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు



చేశామని సీఎం తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధాని అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తామని చెప్పారని... కానీ రోజుకో మాట ఊసరవెల్లి రాజకీయాలు చేశారని సీఎం విమర్శించారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేశారన్నారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చుని.. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులను సంప్రదించగా 58 రోజుల్లో 34 వేల ఎకరాలను రాజధాని కోసం ఇచ్చేశారన్నారు. రాజధానికి, రాష్ట్రానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం తెలిపారు. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వక్తులు తోటలకు నిప్పు పెట్టారని మండిపడ్డారు.

# అమరావతే నవ్యాంధ్ర రాజధాని

## అసెంబ్లీలో ముక్తకంఠంతో చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేలు




**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానం చేసేందుకు రాష్ట్ర శాసనసభ శనివారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉదయం సభ ప్రారంభం కాగానే తీర్మానాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారు. విభజన చట్టంలోని సెక్షన్ 5లోని సబ్‌సెక్షన్ 2లో 'ఎట్ అమరావతి (అమరావతిలో)' అన్న పదాన్ని చేర్చాలని తీర్మానించారు. సెక్షన్ 5కి సంబంధించి విభజన చట్టంలో ఇచ్చిన వివరణలో 'ఏపీ సీఆర్‌డీఏ చట్టం-2014 ప్రకారం నోటిఫై చేసిన కేపిటల్ సిటీ ప్రాంతాలతో సహా అమరావతి' అని చేర్చాలని ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై సభలో చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులు వారి అభిప్రాయాలను సభలో తెలిపారు. 'అమరావతే నవ్యాంధ్ర రాజధాని. అమరావతి రాజధానిగా ఉంటేనే రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది' అని మంత్రులు, ఎమ్మెల్యేల ముక్తకంఠంతో చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "ఒక ప్రాంతం కోసం కాదు. రాష్ట్ర ప్రజలందరి కోసం రాజధాని నిర్మాణం జరుగుతుంది. వైఎస్సార్సీపీ చేసిన 3 రాజధానుల కుట్రను జనసేన తరపున వ్యతిరేకించాం. రైతులకు కౌలు ఇవ్వకుండా వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. పవన్‌కల్యాణ్ రాజధానికి వస్తే ముళ్లకంచెలు (తరువాయి 2వ పేజీలో)



2లో

## నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

## అధిక బరువుతో అనేక అనారోగ్య సమస్యలు!



6లో



2లో

## అమరావతికి చట్టబద్ధత తీర్మానాన్ని కేంద్రానికి పంపిన ఏపీ ప్రభుత్వం

## మహిళల పోరాటంపై అనిత ప్రశంసలు



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి శాతకర్ణి పాలనలో మహిళలకు ఎంతో గౌరవం దక్కిందని హోంమంత్రి వంగలపూడి అనితఅన్నారు. శాసనసభలో హోంమంత్రి మాట్లాడుతూ... అమరావతిని వైసీపీ వారు 'వేశ్యల రాజధాని' అని అవమానకరంగా వ్యాఖ్యానించడం ఎంతో బాధించిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా అమరావతి రైతులు 1631 రోజుల పాటు పోరాడారని తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇది అత్యంత సుదీర్ఘ కాలం జరిగిన పోరాటం అని వివరించారు. ఈ ఉద్యమంలో చంటి బిడ్డలను ఎత్తుకుని, గర్భిణిలు, వృద్ధ మహిళలు కూడా రోడ్డుపైకి వచ్చి పోరాడారని హోంమంత్రి గుర్తు చేశారు.

# జగన్‌పై లోకేశ్ ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానం కోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం పెడితే వైఎస్సార్సీపీ సభ్యులు హాజరు కాలేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల చిత్తశుద్ధి ఏంటో వారి వైఖరితోనే తెలుస్తోందని విమర్శించారు. జగన్‌కు ప్రజలు చూపించిన సినిమా సరిపోలేదేమోనని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. పాదయాత్రతో చంద్రబాబుకు సినిమా చూపిస్తా అంటున్న జగన్‌కు ప్రజలు చూపించిన బ్లాక్ బాస్టర్ సరిపోలేదేమోనని విమర్శించారు. జగన్ చూపిస్తా అంటున్న సినిమా 11 రోజులు కూడా ఆడదని అన్నారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ మీడియాతో ముచ్చటించారు. అమరావతి తీర్మానాన్ని రాజధాని రైతులతో పాటు రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారని చెప్పారు. మరోసారి తుగ్లక్ చర్యలు భరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

## డొమెస్టిక్ గ్యాస్ పక్కదారి

### హోటళ్లలో యథేచ్ఛగా వినియోగం




4లో



## తీవ్రమవుతున్న గ్యాస్ కష్టాలు?

5లో



## పాడేరులో చమురు కొరత?

3లో


పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం
పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను
బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు
సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### తిరకాసు..

ఏ తరగతి వినియోగదారులకూ విద్యుత్ చార్జీల పెంపు లేదని, 2024-25 ట్రూఅప్ చార్జీల భారాన్ని కూడా నివారించామంటూ 2026-27 టారిఫ్ ఆర్డర్ విడుదల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ ప్రకటించడం ప్రజలకు ఊరటగా అనిపిస్తుంది. కానీ, విద్యుత్ వినియోగదారులకు ట్రూఅప్, టారిఫ్ భారాలు మోపకపోయినా ఇంధన సర్దుబాటు చార్జీలు మాత్రం కొనసాగుతాయని చెప్పడంతో ప్రమాదం పొంచివుందని తేలింది. కొన్నేళ్లుగా వినియోగదారుల నుంచి ప్రతినెలా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ఎలాంటి విచారణ నిర్వహించకుండానే యూనిట్‌కు 40 పైసలకు మించకుండా వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇక నుంచి ఈ 40 పైసలకు పరిమితం కాకుండా ఎంతైనా పెంచి వసూలు చేసుకోవచ్చునని ఇటీవల నియంత్రణ మండలి ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే! డిస్కమ్‌లు 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.17,508.17 కోట్ల రెవెన్యూ లోటును ప్రతిపాదించగా ఎపిఇఆర్‌సి రూ.15,790.57 కోట్లకు అనుమతించింది. ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించింది. సమయ ఆధారిత (టైం ఆఫ్ డే) వేళల ధరలు మార్చేందుకు, సోలార్ రూఫ్ టాప్ వినియోగదారులకు నాన్ టెలిస్కోపిక్ పద్ధతిలో బిల్లింగ్ చేసేందుకు, గ్రీన్ పవర్ కేటగిరి తొలగించడానికి డిస్కమ్‌లు ప్రతిపాదనలను తిరస్కరించడం వరకు సానుకూల విషయాలే. ఇదిలా వుండగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు అప్పు తెచ్చుకోవడానికి కేంద్రం విధించిన షరతులకు అంగీకరించి, ప్రభుత్వ కార్యాలయాలకు, సంస్థలకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయాలని అంతకు రెండు రోజులముందు మార్చి 23న ప్రభుత్వం జిఓ 22ను జారీ చేయడం వినియోగదారులపై దొంగ దెబ్బ లాంటిది. సాధారణ వినియోగదారులందరికీ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయడానికి ముందు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు వాటిని బిగించాలని జిఓలో పేర్కొనడం ద్వారా ఇకపై రాష్ట్రమంతటా స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేస్తారన్నది సుస్పష్టం. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలను ఆయా శాఖాధిపతుల (హెచ్‌ఒడి), వేతన చెల్లింపు అధికారుల (డిడిఒ) వారీ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను బిగించాలని, చెల్లించిన డబ్బు మేరకు కరెంటు వినియోగించాక రీఛార్జి చేయకపోతే డిస్కనెక్ట్ చేయాలని జిఓలో ఆదేశించడం దారుణం. ఎన్నో ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించని పరిస్థితి అనుభవైకమే! కనుక ప్రీ పెయిడ్ మీటర్లు బిగించాక బిల్లుల చెల్లింపు తేడా వస్తే విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, తుపాను షెల్టర్లు తదితర సామూహిక ప్రజా వినియోగ భవనాలకు హఠాత్తుగా కరెంటు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. విద్యార్థులు, ఆయా తరగతుల ప్రజలు కష్టాలపాలవుతారు. గతంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్యమాలు, ఆందోళనలు చేయడమే గాక హైకోర్టులో కేసు కూడా దాఖలు చేసిన విషయం వారు మర్చిపోయినా జనానికి గుర్తుంటుంది. ప్రతిపక్షంలో ఉండగా వాటిని వ్యతిరేకించిన వారు అధికారానికి వచ్చాక ఇలా ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడటం తగదు. విద్యుత్‌రంగ సమర్థతను పెంచడానికి సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రజలను మభ్యపెట్టిన ప్రభుత్వ అసలు నైజం ఈ జిఓతో బట్టబయలైంది. ప్రజలపై విద్యుత్ భారాలు వేయడంలోనూ, స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల విషయంలోనూ గత వైసిపికి, ఇప్పటి టిడిపి కూటమి ప్రభుత్వానికి ఏమీ తేడా లేదని ప్రజలు అర్థం చేసుకుంటారు. అదానీ నుండి సెకి ద్వారా విద్యుత్ కొనుగోలులో గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు అమెరికాలో కేసులు నమోదైనా ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదు సరికదా ఇటీవల సరఫరాకు ఉత్తర్వులివ్వడం దాన్ని మరింత బలపరుస్తోంది. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడం, కేంద్ర బిజెపి సర్కారుకు లొంగివుండడంలో దొందూ దొందే అన్నది జనవాక్యం. ఏది ఏమైనా ప్రజలకు తీవ్ర హాని కలిగించే స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లపై నిర్ణయాన్ని, జిఓ 22ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. వెంటనే ప్రజలు రోడ్డెక్కకపోయినా అసంతృప్తి రాజుకొని ఏదో ఒకనాటికి ఉద్యమ జ్వాలగా ఎగుస్తుంది. తస్మాత్ జాగ్రత్త!

## అమరావతిలో అగ్ని ప్రమాద ఘటన కేసులో సెక్యూరిటీ గార్డు అరెస్టు



**గుంటూరు, పతాకం న్యూస్:** ఈ నెల 23వ తేదీన రాజధాని అమరావతిలో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనలో తిప్పుగుడిసె రాము అనే వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని గుంటూరు జిల్లా ఎస్ పి వకుల్ జిందాల్ చెప్పారు. అగ్నిప్రమాదం ఉదంతాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందని, ప్రమాదం ఘటనకు కారణాలను నిర్ధారించేందుకు అధికారుల దర్యాప్తు బృందాన్ని నియమించిందని చెప్పారు. బృందం సమగ్ర విచారణ జరిపిందని చెప్పారు. అగ్ని ప్రమాదం ఉదంతంలో మరింత కుట్రకోణం దాగి ఉందా.. అనే విషయాన్ని నిర్ధారించేందుకు సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్ లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడు రామును హాజరుపరిచారు. ఈ సందర్భంగా కేసు వివరాలను ఎస్ పి వెల్లడించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలం రాయపూడిలోని ముఖ్య కార్యదర్శుల బంగ్లాల సమీపంలో మెగా ఇంజినీరింగ్ సంస్థకు చెందిన పైపులు అగ్నిప్రమాదంలో కాలిపోయాయని అన్నారు. మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ స్టాక్ యార్డ్‌లో జరిగిన ఈ ఘటనలో దొండపాడుకు చెందిన సెక్యూరిటీ గార్డు రాము కావాలనే నిప్పంటించినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. తానే పైపులకు నిప్పంటించినట్లు రాజు అంగీకరించినట్లు ఎస్ పి వివరించారు. మొదట ఈ ఘటనను సాధారణ అగ్ని ప్రమాదంగా పోలీసులు నమోదు చేసినప్పటికీ, రాజధాని ప్రాంతంలో వరుసగా మూడోసారి ఇలాంటి ఘటన జరగడంతో అనుమానాస్పదంగా భావించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ బృందంతో పరిశీలించి, సాక్షులను విచారించగా కీలక విషయాలు బయటపడ్డాయన్నారు. సైట్‌లో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డ్ తిప్పుగుడిసె రాము పై అనుమానం కలిగిందని తెలిపారు. పోలీసుల విచారణలో నిందితుడు రాము సంచలన విషయాలు వెల్లడించాడని, సెలవు ఇవ్వకపోవడం, 24 గంటల డ్యూటీ చేయాలని ఒత్తిడి చేయడం వల్ల మానసిక ఆవేదనకు గురై, పై అధికారులను బెదిరించాలనే ఉద్దేశంతో డీజిల్‌ను సేకరించి పైపుల దగ్గర ఎండిన గడ్డిపై పోసి లైటర్‌తో నిప్పంటించినట్లు ఒప్పుకున్నాడని చెప్పారు. భయపెట్టాలని చేసిన ప్రయత్నం భారీ అగ్నిప్రమాదంగా మారిందని తెలిపారు.

## అమరావతికి చట్టబద్ధత తీర్మానాన్ని కేంద్రానికి పంపిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం(ఘ్రా +శీజ్) ఢిల్లీకి పంపించింది. కేంద్ర హోం శాఖ మంత్రి, రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపించారు. అలాగే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఏపీ చీఫ్ సెక్రటరీకి తీర్మానం కాపీని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపారు. ఈ తీర్మానాన్ని మెయిల్ ద్వారా పంపడంతో పాటు, నేరుగా ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి ద్వారా ఢిల్లీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీకి తీర్మానాన్ని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడమే కాకుండా భవిష్యత్తులో ఎవరు వచ్చినా కూడా అమరావతిని మార్చే అవకాశం లేకుండా చేసే ఉద్దేశంతోనే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని సవరిస్తూ ఏపీ శాసనసభ ఈరోజు ఏకగ్రీవ తీర్మానం చేసింది.

## దళితుల భూములపై నిర్లక్ష్యం తగదు



**కోనసీమ, పతాకం న్యూస్:** తుమ్మలపల్లి గ్రామ దళితులకు కొమరగి పట్నంలో ప్రభుత్వం ఇచ్చిన భూములు ఆక్రమణపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు పాల్గొని అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత నెలలో ఇదే సమస్యపై ఆందోళన చేపట్టినప్పుడు, భూముల వివరాలు తమ వద్ద అందుబాటులో లేవని తహశీల్దార్ చెప్పడం అత్యంత హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ రికార్డులు నిర్వహించాల్సిన బాధ్యత కలిగిన అధికారి, సమాచారం లేదనడం ఆయన అజ్ఞానమో లేదా ఆక్రమణదారులను కాపాడే ప్రయత్నమో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి దళితులకు న్యాయం చేయకుండా తహశీల్దార్ తాత్సారం చేయడం సరికాదన్నారు. ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతూ బాధితులను వేధించడం ఒక ప్రభుత్వ అధికారికి తగదని వెంకటేశ్వరరావు విమర్శించారు. జాతీయ ఎస్‌సి కమిషన్ ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసినా, స్థానిక రెవెన్యూ యంత్రాంగంలో చలనం లేకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్న అల్లవరం తహశీల్దార్‌పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రలోభాలకు తావివ్వకుండా, ఆక్రమణకు గురైన దళితుల భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని అసలైన లబ్ధిదారులకు అప్పగించాలన్నారు.

## నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ



**ఉత్తరప్రదేశ్:** ఉత్తరప్రదేశ్‌లో అత్యాధునికంగా నిర్మించిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (జేవార్) శనివారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోడి అధికారికంగా ప్రారంభించారు. ఈ ఎయిర్‌పోర్ట్.. దేశ విమానయాన రంగంలో సరికొత్త రికార్డులకు వేదిక కానుంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఏర్పడుతున్న విపరీతమైన రద్దీని తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉంది. దాదాపు రూ.11,200 కోట్ల వ్యయంతో, 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో (ఎఫ్‌డీఐ)జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ దీనిని నిర్మించింది. నోయిడా, మీరట్, ఘజియాబాద్, మథుర, ఆగ్రా తదితర ప్రధాన నగరాలకు ఇది ప్రధాన కేంద్రంగా మారనుంది. నేడు ప్రధాని పర్యటన నేపథ్యంలో .... జేవార్‌లో ఐదు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సుమారు 5 వేల మంది పోలీసులు, ఎస్పీజీ, ఏటీఎస్, సీఐఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. భద్రతా కారణాల దఅష్ట్యా ఈ ప్రాంతాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు. మరోవైపు, ఉదయం 7 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు యమునా ఎక్స్‌ప్రెస్‌వే, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. నోయిడా–గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా వెళ్లే భారీ వాహనాలను పోలీసులు మళ్లించారు. అయితే, అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ ప్రారంభోత్సవం అనంతరం ప్రధానమంత్రి భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. పూర్తిస్థాయి అభివృద్ధి తర్వాత నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ఆసియాలోనే అతిపెద్దదిగా, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద విమానాశ్రయాలలో ఒకటిగా రికార్డు సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని నాలుగు దశలలో రూపొందిస్తున్నారు. ప్రాజెక్టు విస్తీర్ణం కూడా దశలవారీగా పెంచనున్నారు. మొదటి దశలో సుమారు 3296ఎకరాలలో విమానాశ్రయం విస్తరించి ఉంది. ఇందులో 3900మీటర్ల పొడవైన రన్ వే, ఒక ప్యాసింజర్ టెర్మినల్, కార్గో టెర్మినల్, ఏటీసీ టవర్, టాక్సీవేస్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఈ దశ పూర్తయితే సంవత్సరానికి 12 మిలియన్ల మంది ప్రయాణికులు ఇక్కడి నుండి ప్రయాణం చేసే అవకాశం ఉంది. భారతీయ వారసత్వాన్ని, సంప్రదాయ ఘాట్ లను, హవేలీలో సౌందర్యాన్ని మేళవించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక మౌలిక సదుపాయాలను ఈ విమానాశ్రయాన్ని రూపొందించారు .ఈ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి విమాన కేంద్రంగా మార్చటంపై దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా అడుగులు వేస్తుంది.

(మొదటిపేజీ తరువాయి)

## అమరావతే నవ్యాంధ్ర రాజధాని

వేసి అడ్డుకున్నారు. రైతులను పరామర్శించకుండా అపి ఇబ్బంది పెట్టారు. అమరావతి రాష్ట్ర ప్రజల మనోభావాలకు సంబంధించిన విషయం. రాష్ట్ర విభజనతో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు రైతులు అండగా నిలిచారు. జగన్, వైఎస్సార్సీపీ నేతలు చేసిన అరాచకం ప్రజలందరికీ తెలియజేయాలి. రాజ్యాంగ ప్రక్రియ, అసెంబ్లీ విధానాలు పాటించకుండా వైఎస్సార్సీపీ వ్యవహరించింది" అని విమర్శించారు.

"అభివృద్ధి విషయంలో రాజకీయ కోణంతో ఆలోచించి వైఎస్సార్సీపీ ఇబ్బంది పెట్టింది. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని జనసేన నిర్ణయం తీసుకుంది. పవన్‌కల్యాణ్ కూడా ఇదే విషయాన్ని అన్నిచోట్లా స్పష్టంగా చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయం జరిగింది. సభ అభిప్రాయం తెలుసుకోకుండా కేంద్రం నిర్ణయం తీసుకోవటంతో రాష్ట్రానికి నష్టం జరిగింది. రాష్ట్ర విభజన బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. మొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఏపీని విడగొట్టవద్దని చెప్పాం. చట్టంలో ఉన్న విధివిధానాలను కూడా పట్టించుకోకుండా చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి మంచి రాజధాని ఉండాలని చంద్రబాబు భావించారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా వచ్చి అమరావతిని ఆశీర్వదించారు. ఏకైక రాజధాని అమరావతి కోసం జనసేన తీవ్రంగా ప్రయత్నించింది. కూటమి విజయం తర్వాత మన బాధ్యత మరింతగా పెరిగింది. అమరావతి తీర్మానం సాంకేతిక అంశం కాదు మనోభావాలకు సంబంధించింది" అని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, " 2019లో ఒక వైరస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అనంతరం ఆ వైరస్ విధ్వంసం సృష్టించింది. ఐదేళ్లలో 50 ఏళ్ల విధ్వంసం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో అభివృద్ధి అటకెక్కింది. ప్రజల మధ్య వైషమ్యాలను వైఎస్సార్సీపీ రెచ్చగొట్టింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసేలా పరిపాలిస్తున్నాం. పవన్‌కల్యాణ్ నటించిన ఒక సినిమాలో అబద్ధాలు మాట్లాడితే ఆకులు రాలుతాయి అనే డైలాగ్ ఉంది. ఒకవేళ జగన్ కూడా నల్లమలకు వెళ్లి మాట్లాడితే అక్కడి చెట్లన్నీ మోడుబారిపోతాయి" అని సత్యకుమార్ విమర్శించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, "రాష్ట్ర విభజనను చాలామంది వ్యతిరేకించారు. రాజధాని విషయంలో శివరామకృష్ణన్ కమిటీ సూచనలు చేసింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో అమరావతిని చేర్చాం. అమరావతి రాజధాని విషయంలో చిక్కులు ఉండవని సూచిస్తున్నా. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని గట్టిగా నమ్ముతున్నా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమరావతి కేంద్రంగా మారనుందని విశ్వసిస్తున్నా" అని సుజనాచౌదరి స్పష్టం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, "అమరావతి ప్రస్తావనలో భూములు ఇచ్చిన రైతులను తలచుకోవాలి. 2019–24 మధ్య రాష్ట్రంలో రాక్షస పరిపాలన జరిగింది. శ్రీలంకలో రావణాసురుడి పాలనలోనూ అంత దుర్మార్గం జరిగి ఉండదు. కేంద్ర సహకారంతో అమరావతిని చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పునర్నిర్మిస్తోంది. రాష్ట్రంలో అభివృద్ధిని వికేంద్రీకరించి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకొస్తున్నారు. ఉత్తరాంధ్రకు భోగాపురం, గూగుల్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిత్తల్ లాంటి సంస్థలు వస్తున్నాయి. రైల్వే జోన్ కూడా ఏర్పాటవుతోంది, రోడ్లు, రైల్వే, పోర్టుల ద్వారా పెట్టుబడులు వస్తున్నాయి. అమరావతి ఓ గ్రీన్ ఫీల్డ్, నాలెడ్జి సిటీగా, ప్రపంచానికే క్వాంటం క్యాపిటల్‌గా తయారవుతుంది.రాష్ట్రానికి కేంద్రం అన్నివిధాలుగా సహకారం అందిస్తోంది. ప్రజల అభిమానాన్ని చూరగొన్న వ్యక్తులు చంద్రబాబు, పవన్. జగన్ మాయమాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు" అని ఎమ్మెల్యే విష్ణుకుమార్?రాజు తెలిపారు. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, " రాజధాని విషయంలో మనం మొదటి నుంచి ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో కేంద్ర సహకారంతో ఏపీ అభివృద్ధి జరుగుతోంది. ప్రజాస్వామ్య విలువలు ఏమాత్రం గౌరవించలేని ప్రతిపక్షం ఇక్కడ ఉంది. అమరావతికి ఒప్పుకుని ఆ తర్వాత మాట మార్చిన చరిత్ర గత పాలకులది. చరిత్రలో ఎక్కడా రైతులు ఇంత భారీ స్థాయిలో భూములు ఇచ్చింది లేదు. రైతుల త్యాగాలకు శాసనసభ ధన్యవాదాలు తెలపాల్సి ఉంది" అని వెల్లడించారు.

# రాగి సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



**సబ్బవరం, పతాకం న్యూస్:** ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు రావడంతో రైతులు కూడా అందుకు అనుగుణంగా పంటల సాగును మారుస్తున్నారు. కొంతకాలం నుంచి ప్రజలు బియ్యం స్థానంలో చిరుధాన్యాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో రైతులు మెట్ట భూములతోపాటు బోరు, బావుల నీటి సదుపాయం వున్న భూముల్లో రాగి (చోడి) పంటను సాగు చేస్తున్నారు. నామమాత్రపు పెట్టుబడితో తక్కువ సమయంలో పంట చేతికి వస్తుండడంతో పలువురు రైతులు రాగి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌తో పోలిస్తే రబీ సీజన్‌లో ఎక్కువ దిగుబడి వస్తున్నదని అంటున్నారు. దీంతో రబీ సీజన్‌లో వేసిన పంట ప్రస్తుతం కోత దశలో వుంది. చిరుధాన్యాల్లో ఒకటైన రాగిలో క్యాల్షియం అధికంగా ఉండడం, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండడం, పీచు పదార్థం కావడంతపాటు బియ్యం, గోధుమ పిండితోపోలిస్తే ఎక్కువ పోషకాలు వుండడంతో ఇటీవల రాగుల వినియోగం గణనీయంగా పెరిగింది. పలు టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో రాగి పిండితో ప్రత్యేకంగా చేసే రాగి ఇడ్లీ, రాగి దోశ, రాగి సంకటి వంటి ఆహార పదార్థాలను మెనూలో చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకుల్లో రాగులను చేర్చింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 2025-26లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాకు రూ.4,886గా ప్రకటించింది. వ్యాపారులు రైతుల నుంచి వ్యాపారులు క్వింటా రూ.5 వేలకుపైగా ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.80 వరకు వ్యాపారులు అమ్ముతున్నారు. క్రమేపీ ధర పెరుగుతుండడంతో సబ్బవరం మండలంలోని అసకపల్లి, నక్కవానిపాలెం, గొల్లలపాలెం, అమృతపురం, సబ్బవరం, వంగలి, అంతకాపల్లి, గుల్లేపల్లి, గొర్లివానిపాలెం, పెదనాయుడుపాలెం తదితర గ్రామాల్లో పలువురు రైతులు రాగి పంటను సాగుచేస్తున్నారు. దీంతో ఏటేటా విస్తీర్ణం పెరుగుతున్నది. ఆరు తడి పంట కావడంతో కొద్దిపాటి నీటి సదుపాయం వున్న భూముల్లో ఈ పంటను పండిస్తున్నారు. దుక్కి దున్నడం, విత్తనాలు, కలుపుతీత, ఎరువులు, పురుగు మందులు, కోత, నూర్పిడి వంటి పనులన్నీ కలిపి ఎకరాకు గరిష్ఠంగా రూ.15 వేలు ఖర్చు అవుతుంది. విత్తిన 120 రోజుల్లో పంట చేతికి అందుతుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటా రూ.5 వేలచొప్పున విక్రయిస్తే.. రూ.40-50 వేల ఆదాయం వస్తుంది. ఖర్చులుపోను రూ.30 వేల వరకు మిగులుతాయి.

## పాడేరులో చమురు కొరత?



**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరులో చమురు కొరత వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల మధ్య యుద్ధ ప్రభావం జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ సరఫరాపై తీవ్రంగా చూపుతున్న విషయం తెలిసిందే. దీంతో బంకుల్లో ఎప్పుడు చమురు ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పాడేరులో ఏడు బంకులు ఉండగా, రెండు బంకుల్లో మాత్రమే డీజిల్, పెట్రోల్ నిల్వలున్నాయి. మిగిలిన బంకుల్లో అరకొరగానే ఉంటున్నాయి. పాడేరులో శుక్రవారం పాత బంకు, తలారిసింగిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంకులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అలాగే చింతలవీధిలో ఐటీడీఏ నిర్వహణలో ఉన్న హెచ్‌పీ బంకులో డీజిల్ మాత్రమే ఉండగా, జి.మాడుగుల రోడ్డులో ఉన్న భారత్ పెట్రోలియం బంకులో డీజిల్ లేకపోగా పెట్రోల్ మాత్రమే ఉంది. విశాఖపట్నం వెళ్లే మెయిన్ రోడ్డులోని ఉన్న టి.చిట్టినాయుడు, బొర్రా విజయరాణి ఫిల్లింగ్ స్టేషన్లలో మాత్రమే డీజిల్, పెట్రోల్ రెండూ ఉన్నాయి. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో జీసీసీ నిర్వహించే హెచ్‌పీ పెట్రోల్ బంకు పెట్రోల్, డీజిల్ నిల్వలు లేక మూతపడింది. దీంతో 15 పంచాయతీల ప్రజలకు పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు.

## దళారుల చేతిలో నష్టపోతున్న జీడిమామిడి రైతులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** దిగుబడి అధికంగా వచ్చినా ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో దళారుల చేతిలో జీడిమామిడి రైతులు దగా అవుతున్నారు. ఉమ్మడి అల్లూరి జిల్లాలో రంపచోడవరం నుంచి అనంతగిరి మండలం వరకు సుమారు 70 వేల ఎకరాల్లో జీడిమామిడి సాగవుతోంది. ఈ ప్రాంత వాతావరణం జీడిమామిడి సాగుకు అనుకూలం కావడంతో 65 శాతం మంది రైతులు జీడితోటలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒక్క కొయ్యూరు మండలంలోనే 28 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ప్రతీ ఏటా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మండలంలో 50 టన్నుల నుంచి 70 టన్నుల జీడిమామిడి పిక్కల దిగుబడి వస్తుంది. అయితే ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించకపోవడంతో దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు రైతుల నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది జీడిమామిడి పిక్కల సీజన్ ఆరంభంలో 80 కిలోల బస్తా ధర రూ.11 వేలు పలికింది. అయితే వర్షాల వల్ల పిక్క నాణ్యత లేదనే సాకుతో దళారులు కుమ్మక్కై ధరను ఒక్కసారిగా రూ.3 వేలు తగ్గించారు. సీజన్ ఆఖరికి బస్తా రూ.7 వేలకు పడిపోయింది. అలాగే 2024లో బస్తా రూ.8 వేలు దాటకుండా కొనుగోలు చేశారు. ధర విషయంలోనే కాకుండా తూకం విషయంలో కూడా రైతులను దళారులు మోసగిస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ఉద్దేశంతో దశాబ్దం క్రితం ఐటీడీఏ అధికారులు ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. అలాగే మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రాసెసింగ్ జరిపేలా రావణాపల్లిలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినా అది వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. జిల్లాలో కాఫీ, మిరియాలు వంటి పంటలను కొనుగోలు చేస్తున్న జీసీసీ జీడిమామిడి పిక్కల కొనుగోలు విషయంలో ముందడుగు వేయడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీడిపిక్కల సీజన్‌కు ముందే ప్రాసెసింగ్ యూనిట్‌ను తెరిపించాలని, జీసీసీ ద్వారా మండలానికి నాలుగైదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జీడిపిక్కలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ మాట్లాడుతూ జీడిమామిడి సాగు చేస్తున్న మండలాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో జీసీసీ, వెలుగు అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చూస్తామని ఆమె తెలిపారు.

## రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ లేజర్ గన్‌ల ఏర్పాటు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూసేందుకు, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ లేజర్ గన్లు ఏర్పాటు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సీఎస్ఆర్ నిధులు సుమారు రూ.18 లక్షలతో సమకూర్చిన రెండు స్పీడ్ లేజర్ గన్లను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు, వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్దీకరించడానికి ఈ స్పీడ్ లేజర్‌గన్లు ఉపకరిస్తాయన్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపినా, హెల్మెట్ లేకపోయినా, వాహనంపై ముగ్గురు ప్రయాణించినా, వ్యతిరేక దిశ (రాంగ్ రూట్)లో వెళ్లినా, ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా ఈ స్పీడ్ లేజర్ గన్లు 100 మీటర్ల దూరంలోనే పసిగడతాయన్నారు. ఆటోమేటిగ్గా వారికి ఇ-చలాన్ జారీ అవుతుందన్నారు. ఈ గన్‌ల సాయంతో నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగ్గా క్రమబద్ధీకరించవచ్చునని సీపీ అభిప్రాయపడ్డారు. త్వరలో మరో స్పీడ్ లేజర్ గన్‌ను సౌత్ ఏషియన్ ఎల్‌పీజీ వారు సమకూర్చనున్నారని తెలిపారు. ఈ మూడింటిని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ ఐసీ) ద్వారా అనుసంధానం చేసి ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడే వాహనదారులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రియల్ టైమ్‌లో చలానాలు జారీచేస్తామన్నారు.

## వీబీజీ రాంజీ చట్టంపై అవగాహన కార్యక్రమం




**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ నేతృత్వంలో అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పర్యవేక్షణలో వి.బి.జి.రాంజీ జిల్లా కొకన్వీనర్ మార్కెట్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం గొలగం గ్రామంలో భారతదేశ పార్లమెంట్ చేసినటువంటి విబిజి రాంజీ చట్టంపై అవగాహన కార్యక్రమం చేయటం జరిగింది అని భాస్కర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ చట్టంపై ఉపాధి కూలీలకు వివరాలను అందించి, చట్టం తీసేది కాదని మెరుగైన ఉపాధితో ముందుకు వస్తుందని తప్పుడుగా ప్రచారం చేసే వ్యక్తులు పై చర్యలు తప్పవని తెలియజేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రూరల్ అధ్యక్షులు కపిరి తాతారావు పట్టణ అధ్యక్షులు కొమనపల్లి సన్యాసిరావు, పరదేశి నాయుడు, రాపేటి సంతోష్ బల్లి నరసింగరావు కూటమి నాయకులు పంచాయతీ మెట్లు సుమారు 90 మంది ఉపాధి హామీ రైతులు పాల్గొన్నారు.

## కుప్పకూలిన డ్రోన్..



**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరు సీతారామరాజు మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఒక్కసారిగా డ్రోన్ కూలి పోయింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జిల్లాలోని జి.మాడుగుల మండలం బొయితిలి సమీపంలో ఈ ఘటన చోటు చేసు కుంది. ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు అత్యవసరమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెడ్ వింగ్ సంస్థ, ప్రభుత్వం సంయుక్తంగా డ్రోన్ సేవలను పరిశీలిస్తున్నాయి. రక్తం నమూనాలు, అత్యవసర మందులను వేగంగా తరలించేందుకు ఎమర్జెన్సీ మెడికల్ ట్రయల్ రన్ చేపట్టారు. ఆ క్రమంలో బొయితిలి గ్రామ పరిసరాల్లో ఎగురుతూ కూలిపోయింది. ఈ డ్రోన్.. చెట్లపై పడింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పాయకరావుపేటలో వృథాగా జిల్లా పరిషత్ అతిథిగృహం



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** పాయకరావుపేట పట్టణంలో కోటిన్నర రూపాయల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ అతిథిగృహం వృథాగా పడివుంది. ప్రధానంగా ఫర్నిచర్ సమకూర్చకపోవడంతో నిరుపయోగంగా మారింది. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఒక సూట్ రూమ్‌ను పాత సామాన్లతో స్టోర్ రూమ్‌గా మార్చేశారు. నిర్వహణ కొరవడడంతో గదులు, ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అతిథిగృహం పోర్టికోతోపాటు ఆవరణను స్థానికులు వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం పాయకరావుపేటలో జిల్లా పరిషత్ అతిథిగృహాన్ని నిర్మించారు. చాలా ఏళ్ల వరకు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల రాకపోకలు, విడిదితో సందడిగా వుండేది. ఈ నేపథ్యంలో మూడు దశాబ్దాల క్రితం భవనంపై మరో అంతస్థుల నిర్మించారు. కానీ పునాదులు బలంగా లేకపోవడంతో కొద్దికాలానికే భవనం గోడలు, శ్లాబు దెబ్బతిని, పెచ్చులూడి పడుతుండడంతో అతిథిగృహాన్ని వినియోగించడం ఆపేశారు. మరమ్మతులు కూడా చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1.5 కోట్లతో అతిథిగృహానికి రెండు అంతస్థులతో ఆధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మించారు. ఇందులో నాలుగు సూట్‌లు, ఒక సమావేశ మందిరం, డైనింగ్ హాలు వున్నాయి. కానీ సూట్ రూమ్‌లలో బెడ్స్, టేబుళ్లు, కుర్చీలు, టీపాయిలు వంటి ఫర్నిచర్ సౌకర్యాలు కల్పించలేదు. తరువాత వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఈ భవనాన్ని అప్పుడప్పుడు క్యాంపు కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. వైసీపీ నాయకులు ఫర్నిచర్ ఏర్పాటు చేసుకుని అతిథిగృహాన్ని సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో.. వైసీపీ నాయకులు ఈ అతిథిగృహంలో అంతకుముందు తాము ఏర్పాటుచేసుకున్న ఫర్నిచర్‌ను పట్టుకుపోయారు. దీనిని వినియోగంలోకి తెచ్చేందుకు జిల్లా పరిషత్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. పీఆర్ ఉద్యోగులు కింది అంతస్థులోని ఒక సూట్ రూమ్‌ను స్టోర్ రూమ్‌గా మార్చేశారు. పనికిరాని వస్తువులను ఇందులో పడేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి అయిన వంగలపూడి అనిత అధికారుల సమావేశాలను నక్కపల్లి సమీపంలోని తన క్యాంపు కార్యాలయంలోనే నిర్వహిస్తుండడంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాయకరావుపేటలోని అతిథిగృహం బాగోగులను పట్టించుకోవడం మానేశారు. గెస్ట్ హౌస్ నిర్వహణకు అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. కనీసం వాచ్‌మన్ కూడా లేరు. అప్పుడప్పుడు పంచాయతీ సిబ్బంది వచ్చి ఆవరణను శుభ్రం చేస్తుంటారు. సూట్ రూమ్‌లు, బాత్‌రూమ్‌ను శుభ్రం చేయకపోవడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయాయి. వాచ్‌మన్ సైతం లేకపోవడంతో పలువురు నాయకులు, ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలను పోర్టికోలో, ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు.

## నర్సీపట్నంలో మరో రెండు కోర్టులు ఏర్పాటుకు అడుగులు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ న్యాయవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించనున్నాయి. హైకోర్టు ప్రతిపాదన మేరకు రాష్ట్రంలో కొత్తగా 96 కోర్టుల ఏర్పాటుకు జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదించారు. కొత్తగా మంజూరైన కోర్టుల్లో రెండు నర్సీపట్నంలో ఏర్పాటు కానున్నాయి. వీటిలో ఒకటి అదనపు జిల్లా సెషన్స్ జడ్డి కోర్టు కాగా, మరొకటి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు వున్నాయి. స్థానిక కోర్టు సముదాయంలో అదనంగా రెండు కోర్టులను ఏర్పాటు చేయడానికి అవసరమైన వసతులు, సదుపాయాలను పరిశీలించడానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు శుక్రవారం నర్సీపట్నం వచ్చారు. న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆర్అండ్‌బీ డీఈఈతో మాట్లాడారు. ఇక్కడి కోర్టు సముదాయ భవనాలను పరిశీలించిన అనంతరం.. కొత్తగా మంజూరైన రెండు కోర్టులను నిర్వహించడానికి తాత్కాలిక సదుపాయాలు సరిపోతాయని అభిప్రాయపడ్డారు. నీటి సదుపాయం కోసం మరో బోరు వేయించడానికి ఆయన భూమి పూజ చేశారు. ప్రస్తుతం నర్సీపట్నం కోర్టు సముదాయంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు, అదనపు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్)తో మొత్తం కోర్టుల సంఖ్య ఏడుకు చేరుతుంది. నర్సీపట్నం కోర్టు సముదాయంలో ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్థులో ఆయా కోర్టులను నిర్వహిస్తున్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న కోర్టుల నిర్వహణతోపాటు ఇతర అవసరాల నిమిత్తం అదనపు వసతి కోసం రెండో అంతస్థు నిర్మాణానికి ప్రభుత్వం గత ఏడాది రూ.3.9 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల ఆర్థిక శాఖ పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడమే మిగిలి వుంది.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

**రాజాం, పతాకం న్యూస్:** మండల పరిధిలోని పొగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం పాలఖండ్యాం నుంచి రాజాం వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఇదేమార్గంలో వస్తున్న వ్యాను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శశిభూషణ్, మంగ తదితరులు గాయపడ్డారు. వీరంతా రాజాం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక అడుగు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు. శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం. ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గిరిజనులను అవమానించిన ఎమ్మెల్యే అశోక్ రాజీనామా చేయాలి




**కురుపాం, పతాకం న్యూస్:** ఆదివాసీ గిరిజన నాయకులను, ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ఇచ్చాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గిరిజనులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని బేతకండి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు, సంఘ నాయకులు ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని వినతి పత్రం ఇవ్వడానికి ఆదివాసి జెఏసి ప్రతినిధులు జి.అప్పన్న, ఎస్.జగన్నాథ్ తదితరులు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లిన సందర్భంలో వారిపై ఎమ్మెల్యే అసభ్యపదజాలంతో మాట్లాడడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రజల సమస్యలు వినాల్సిన ప్రజాప్రతినిధి ఇలాంటి ప్రవర్తన చూపడం గిరిజన సమాజాన్ని అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన ఎమ్మెల్యే తన పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు కోల్పోయారని పేర్కొన్నారు. వెంటనే రాజీనామా చేసి గిరిజన నాయకులకు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజనుల సమస్యలపై చర్చించేందుకు వచ్చిన ప్రతినిధులను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లను పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే రాస్తారోకోలు, ధర్నాలు, ముట్టడిలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన, ప్రజా సంఘం నాయకులు సీదరపు అప్పారావు, లక్ష్మణరావు, సన్యాసిరావు, ఎం.రమణ, సీతారాం, మండంగి శ్రీను, కె.గంగు నాయుడు, వి.ఇందిర, ఎన్వై నాయుడు, గిరిజనులు సంఖ్యలో పాల్గొన్నారు.

## మిట్టల్ ఉక్కు పరిశ్రమలో లక్ష ఉద్యోగాలు ఒట్టి బూటకం



**విజయనగరం, పతాకం న్యూస్:** అనకాపల్లి వద్ద నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ నిర్మాణం విశాఖ ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకే తప్ప మరొకటి కాదని, కూటమి ఎమ్మెల్యేలు చెబుతున్న ఈ స్టీల్ ప్లాంట్ వలన లక్ష ఉద్యోగాలు అనేవి ఒట్టి బూటకమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ ప్రపంచంలోనే అతి పెద్దదని, లక్ష ఉద్యోగాలు వస్తాయని కూటమి ఎమ్మెల్యేలు ఊదరగొట్టి చేస్తున్న ఉపన్యాసాలు పచ్చి అబద్ధమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మిట్టల్‌కు ధారాదత్తం చేసేందుకు పక్కనే మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమలో 7.2 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరుగుతుండని, అక్కడ కేవలం 15 వేల మంది మాత్రమే ఉద్యోగులే పనిచేస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు కు నిధులు, ఘనులు కేటాయిస్తే మరిన్ని ఉద్యోగాలు వస్తాయన్నారు. 8.3 మెట్రిక్ టన్నులు కెపాసిటీగల నక్కపల్లి పరిశ్రమలో లక్ష ఉద్యోగాలు వస్తాయని కూటమి ఎమ్మెల్యేలు ఏ విధంగా చెబుతారని ఆయన ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసి పెట్టుబడిదారులకు అప్పగించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం చేయొద్దని ఐదేళ్లుగా కార్మికులు, ప్రజాసంఘాలు పోరాడుతున్నా రన్నారు. మరోవైపు విశాఖ ఉక్కు పరిశ్రమకు వెళ్తున్న నీటిని కూడా మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు తరలించాలని ప్రభుత్వం చూడటం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజలు సొమ్మును 25 వేల కోట్లను మిట్టల్‌కు ధారాదత్తం చేస్తున్నారన్నారు. స్టీల్ ప్లాంట్ కు నిధులు కేటాయించాలని, ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ పాల్గొన్నారు.

## విశాఖ-ఢిల్లీ ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** విశాఖపట్నం నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానంలో శనివారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో పైలట్లు అప్రమత్తమై ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 161 మంది ప్రయాణికులు ఉండగా, అందరూ సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఇండిగోకు చెందిన 6ఈ 579 విమానం విశాఖ నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తుండగా, ల్యాండింగ్‌కు కొద్దిసేపటి ముందు ఇంజిన్‌లో సాంకేతిక సమస్యను పైలట్లు గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, ప్రయారిటీ ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. ఉదయం 10:54 గంటల సమయంలో విమానాశ్రయంలో ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. అగ్నిమాపక శకటాలను రన్‌వే వద్ద మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనపై ఇండిగో సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. "ముందుజాగ్రత్త చర్యగా, ప్రామాణిక నిబంధనల ప్రకారం పైలట్లు ప్రయారిటీ ల్యాండింగ్ కోరారు. ప్రయాణికుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. ప్రస్తుతం విమానానికి అవసరమైన తనిఖీలు, మరమ్మతులు జరుగుతున్నాయి" అని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇండిగో ఈ బోయింగ్ 737 విమానాన్ని టర్కీకి చెందిన కొరెండన్ ఎయిర్‌లైన్స్ నుంచి స్వల్పకాలిక లీజుకు తీసుకుంది.

## చెరకు క్రషింగ్ పూర్తి




**విజయనగరం, పతాకం న్యూస్:** రేగిడి మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి షుగర్స్‌లో శనివారంతో చెరకు క్రషింగ్ పూర్తి చేయనున్నట్లు ఆ సంస్థ హెడ్, జనరల్ మేనేజర్ వెంకట సూర్య తేజ తెలిపారు. ఇంకా చెరకు ఉన్న రైతులు సిడిఎ, సిడిఎం వద్దకు వెళ్లి కటింగ్ ఆర్డర్లను తీసుకోవాలని కోరారు. రైతులకు సకాలంలోనే బిల్లులు చెల్లించామని వెల్లడించారు. నాలుగు నెలలు చెరకు క్రషింగ్‌కు నాణ్యమైన చెరకు తరలించారని వివరించారు. కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించామని తెలిపారు. చెరకు పంపిణీ చేసిన రైతులు కర్మాగారానికి సహకరించారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## డొమెస్టిక్ గ్యాస్ పక్కదారి
### హోటళ్లలో యథేచ్ఛగా వినియోగం



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లా వ్యాప్తంగా గ్యాస్ కొరత తీవ్రంగా ఉంది. అందులో కమర్షియల్ సిలిండర్ల కొరత మరీనూ. దీంతో గృహ వినియోగానికి ఉపయోగించే డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, సివిల్ సప్లై అధికారులు కుమ్మక్కై డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లకు మళ్లిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడిన కొందరు అధికారులే అటు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు, ఇటు హోటల్, రెస్టారెంట్ల యజమానులకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. గజపతినగరం మండల కేంద్రంలో ఓ ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకుడు డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్న విషయం వెలుగుచూసింది. అధికంగా గృహ వినియోగ సిలిండర్లను తీసుకొచ్చి వంట సాగిస్తున్నట్లు స్వయంగా ఆ రెస్టారెంట్ యజమానే చెబుతున్నారు. ఇదే పరిస్థితి పట్టణంలోని అనేక హోటళ్లు, రెస్టారెంట్లలో కనిపిస్తోంది. మరోవైపు గృహ వినియోగానికి సిలిండర్లు బుకింగ్ చేస్తే రోజుల తరబడి రావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డొమెస్టిక్ సిలిండర్లను పక్కదారి పట్టించి, బ్లాక్‌లో ఏజెన్సీ నిర్వాహకులు అమ్ముకోవడం వల్ల తమకు సరఫరా చేయడం లేదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కాసుల కోసం లాలూచీ గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సివిల్ సప్లై, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు దాడులు చేపడుతున్నారు. గజపతినగరం పట్టణంలో సివిల్ సప్లై అధికారులు ఇంతవరకూ ఎక్కడా దాడులు చేసిన ఆనవాళ్లు లేవు. మరోవైపు పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో విచ్చలవిడిగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఓ హోటల్‌లో డొమిస్టిక్ సిలిండర్లను భారీగా వినియోగిస్తున్నట్లు సివిల్ సప్లయి ఉప తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి తనిఖీలు చేపట్టలేదు. అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడటం వల్లే గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లకు తరలిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, గృహ వినియోగ సిలిండర్లు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన కారు ముగ్గురు మృతి

**చిత్తూరు, పతాకం న్యూస్:** చిత్తూరు జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బంగారుపాళ్యం మండలం శేషాపురం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆర్టిసి బస్సును కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు




**విజయనగరం, పతాకం న్యూస్:** పయాణికుల భద్రతే ధ్యేయంగా సాలూరు బైపాస్ రోడ్డు వద్ద అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రం గుండా వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులను లక్ష్యంగా చేసుకుని పోలీస్, రవాణా, అగ్నిమాపక శాఖ అధికారులు 14 వాహనాలకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా అధికారులు ప్రతి బస్సును ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా బస్సుల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాల లభ్యత, అత్యవసర ద్వారాల పనితీరును అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీ చేశారు. రవాణా శాఖ అధికారులు బస్సులకు సంబంధించిన పర్మిట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ పత్రాలతో పాటు డ్రైవర్ల లైసెన్సులను తనిఖీ చేశారు. అదేవిధంగా బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అక్రమంగా సరుకు రవాణా చేయడం వంటి అంశాలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టారు. నిబంధనలు అతిక్రమించే ట్రావెల్స్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడేలా వ్యవహరిస్తే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## తాగునీటి పైపులైన్‌కు లీకులు



**గజతినగరం, పతాకం న్యూస్:** గంగచో ళ్లపెంట గ్రామంలో తాగునీటి పైపులైన్లు లీక్ కావడం తో నీరు వృథాగా పోవడంతో పాటు కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతు న్నారు. కలుషిత నీటి వల్ల డయేరియా, మలేరియా, క్షయ వంటి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని భ యాందోళన చెందుతున్నారు. వేసవి కాలం కావడంతో తాగునీరు వృథాగా పోతుందని, అలాగే పైపులైన్లు లీక్‌లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరు తున్నారు. ఎన్నో ఏళ్లగా వేసిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రైనేజీలో పైపులైన్లు ఉండడంతో లీకుల వల్ల మురుగునీరు చేరి తాగునీరు కలుషిత అవుతుంద ని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయ తీ పాలకులు, అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి.. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పాడి రైతుల కోసం విజ్ఞాన యాత్ర




**గజతినగరం, పతాకం న్యూస్:** పాడి రైతుల అభివద్ధి, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు పాడి రైతుల విజ్ఞాన యాత్ర బస్సును రామచంద్ర పురంలో శనివారం ప్రారంభించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రారు, ఆత్మ ఎడిఎ బి.నాగ కుమార్, పశుసంవర్ధక శాఖ ఎడి ఒ.రామకృష్ణ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతులకు ఆధునిక పాడి పశు సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు. రామన్నగూడెం పశు రీసెర్చ్ సెంటర్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి రైతులను సాంకేతికంగా అభివద్ధి చేయాలని లక్ష్యంగా ఈ విజ్ఞాన యాత్రను నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పాడి- పశుసంరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రారు మాట్లాడుతూ నియోజకవర్గం నుండి 41 మంది రైతులను ఈ విజ్ఞాన యాత్రకు పంపుతున్నట్లు తెలిపారు. గంగవరం మండలం 20, రామచంద్రపురం మండలం 21 మంది రైతులు పశు వైద్యాధికారులతో కలిసి విజ్ఞానయాత్రకు వెళ్లారన్నారు.

## వాహనదారులకు గుడ్‌న్యూస్.. ఆర్సీ, డీఎల్ కార్డులు ఇక నేరుగా ఇంటికే!



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేయనుంది. కార్డుల ముద్రణ, పంపిణీలో నెలల తరబడి జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు 'సెంట్రలైజ్డ్ ప్రింటింగ్, డిస్పాచ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జరిగిన సమావేశంలో ఆమోదం తెలిపినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 61 ఆర్టీఏ కార్యాలయాల్లో కార్డుల ముద్రణ జరుగుతుండటంతో తీవ్ర జాప్యం నెలకొంది. ఏటా సుమారు 15 లక్షల కార్డులు జారీ చేయాల్సి ఉండగా, లబ్ధిదారులకు చేరడానికి నెలల సమయం పడుతోంది. దీంతో వాహనదారులు తనిఖీల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏజెంట్ల వద్ద వందలకొద్దీ కార్డులు లభ్యం కావడంతో దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే కేంద్రం నుంచి కార్డులను ముద్రించి, నేరుగా వాహనదారుడి చిరునామాకు పోస్టు ద్వారా పంపిస్తారు. దీనివల్ల ఏజెంట్ల ప్రమేయం పూర్తిగా తొలగిపోతుంది. కార్డులు చేరలేదని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసి, డూప్లికేట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవసరం కూడా తప్పుతుంది. ఈ సంస్కరణతో పాటు రవాణా శాఖకు ఏటా యూజర్ ఛార్జీల రూపంలో వచ్చే సుమారు రూ. 135 కోట్లను శాఖకే కేటాయించేందుకు సీఎం అంగీకరించారు. ఈ నిధులతో శాఖాపరమైన సేవలను మరింత మెరుగుపరచడానికి వీలు కలుగుతుంది.

## శ్రీనగర్-లేహ్ హైవేపై భారీ హిమపాతం.. ఏడుగురు మృతి



**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్-లేహ్ రహదారిపై ప్రకృతి కన్నెర్రజేసింది జోజి లా కనుమ సమీపంలో ఒక్కసారిగా భారీ హిమసంపాతం విరుచుకుపడటంతో ఏడుగురు వ్యక్తులు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో సుమారు ఒక డజను వాహనాలు మంచు కింద కూరుకుపోయాయి. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే విపత్తు సహాయక దళాలు , బీఆర్‌ఓ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషాద ఘటనపై లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్గిల్ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి రెస్క్యూ ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రస్తుతం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, మంచులో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

## ప్రధాని, సీఎంలను తొలగించే బిల్లు.. నివేదికకు మరింత సమయం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తీవ్రమైన అభియోగాలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులపై నివేదిక మరింత ఆలస్యం కానుంది. ఈ బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సమర్పించడానికి మరింత సమయాన్ని కోరింది. దీంతో జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఈ కమిటీకి అదనపు సమయాన్ని మంజూరు చేసింది. వచ్చే వర్షాకాలం పార్లమెంట్ సమావేశాల చివరివారంలోని మొదటి రోజు వరకూ ఈ కమిటీకి గడువు ఇచ్చారు. వర్షాకాల సమావేశాలు సాధారణంగా జులై మూడోవారంలో ప్రారంభమవుతాయనే సంగతి తెలిసిందే. ప్రధాని, ముఖ్యమంత్రులను తొలగించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు 2025, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2025, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు 2025ను బిజెపి ఎంపి అపరాజిత సారంగి నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఆగస్టు 20న లోక్‌సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ తరువాత ఈ బిల్లులను కమిటీకి పంపారు.

## హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్ట్

**కడప, పతాకం న్యూస్:** ప్రియా లేడీస్ హాస్టల్ వద్ద గిరిధర్ రాజు పై పాత కక్షలతో ఈనెల 8వ తేదీ కట్టెలు మరియు ఇనుప రాడ్లతో దాడి, హత్యా యత్నానికి పాల్పడ్డ ఆలమూరి వెంకట కార్తీక్ రెడ్డి, గుడ్డం ఎర్రి స్వామి రెడ్డిని శుక్రవారం ఆకేపాడు క్రాస్ రోడ్డు వద్ద రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. ఈ ఘటనపై శనివారం ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ నచకేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడం జరిగిందని వివరించారు. మరో 11 మంది ముద్దాయిలపై నేరము రుజువైందని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# తీవ్రమవుతున్న గ్యాస్ కష్టాలు?



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎక్కడ చూసినా.. గ్యాస్ కష్టాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ బుకింగ్, డెలివరీకి సంబంధించి ఆయా కంపెనీలు నిబంధనలు కఠినతరం చేశాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల కష్టాలు వెంటాడుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో చాలాచోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి. శ్రీకాకుళంలోని పలు హోటళ్లలో కట్టెలపొయ్యిపైనే వంటకాలు తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులదీ అదే పరిస్థితి. గ్యాస్ కొరత కారణంగా ఖర్చులు పెరుగుతున్నాయని, సకాలంలో వంట తయారీ కష్టమవుతోందని హోటళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వసతిగృహాలతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిలిండర్ల కొరత కారణంగా విద్యార్థులకు భోజనాల నిర్వహణ కష్టమవుతోంది. చాలాచోట్ల కట్టెల పొయ్యిలను వినియోగిస్తున్నారు. చాలా పాఠశాలల్లో వంట గ్యాస్ కొరత కారణంగా వంట చేయడానికి ఎండీఎం వర్కర్లు, పాఠశాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ మండలం కురుంపేట, పాలవలస తదితర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కట్టెలపొయ్యిపై వంటలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వాపోతున్నారు. గోదాముల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.గ్యాస్ సిలిండర్ దొరుకుతుందో లేదోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బుక్ చేసుకోవడానికి ప్రయత్నించినా సెల్‌కు ఓటీపీలు రావడంలేదు. ఓటీపీలు వచ్చిన తర్వాత కూడా గ్యాస్ కోసం వినియోగదారులు ఉదయం నుంచీ బారులు తీరుతున్నారు. కొన్నిచోట్ల బుక్‌చేసి 25 రోజులు దాటిని సిలిండర్లు ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఈక్రమంలో కొంతమంది మహిళలు కట్టెలపొయ్యిపైనే ఆధారపడి వంటలు చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్యాస్ కష్టాలకు చెక్ పెట్టాలని వినియోగదారులు, నిర్వాహకులు కోరుతున్నారు. పలాస-కాశీబుగ్గలోని భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద పెద్దఎత్తున వినియోగదారులు సిలిండర్ల కోసం నిరసన చేపట్టారు. గోడౌన్ వద్ద వేకువజాము నుంచి పడిగాపులు కాస్తున్నా.. కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుక్ చేసి రెండువారాలు దాటినా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం లేదని వాపోయారు. ఇలా అయితే తాము ఎలా బతికేదని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పలాస మండలంలో గ్రామీణ ప్రాంత వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాళభద్రలో గోడౌన్ వద్దకు అధిక సంఖ్యలో వినియోగదారులు తరలివచ్చారు. తాము వారం రోజులుగా గ్యాస్ కోసం తిరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. గోడౌన్ వద్ద 'ఇక్కడ గ్యాస్ అందివ్వబడదు' అనే బోర్డు చూసి.. కొంతమంది నిరాశతో వెనుదిరిగారు. వీఆర్వోలు భీమారావు, ఎర్రయ్య గొడౌన్ వద్దకు చేరుకుని.. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ఇంటి వద్ద సిలిండర్లు సరఫరా చేస్తామని తెలిపారు. టెక్కలిలో కూడా గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారులు బారులుదీరారు. సిలిండర్ బుక్ చేసినా.. సకాలంలో సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల ద్వారా సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో ఏజెన్సీ వద్దకు వచ్చి.. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోయారు. వజ్రపుకొత్తూరులోనూ ఇదే పరిస్థితి. ఉద్దానం ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా నిర్వహించడం లేదు. గ్యాస్ ఎప్పుడు ఇస్తారని ఫోన్‌లో సిబ్బందిని సంప్రదించగా.. మీరే ఏజెన్సీ వద్దకు రావాలంటూ సమాధానమిస్తున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ రామారావు వద్ద ప్రస్తావించగా.. గ్యాస్ సరఫరా కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సమస్య ఏర్పడుతోందన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు.

# సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి




**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ .... సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు 4వ రోజైన శనివారం కూడా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ కి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్ల కొమ్ముకాస్తుందని విమర్శించారు. 50 సంవత్సరాల వయసు దాటిన సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్స్ ని తొలగిస్తున్న నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లో రిట్ వేసామన్నారు. హైకోర్టు ప్రస్తుతం స్టే విధించిందన్నారు. చట్ట విరుద్ధంగా తీసుకొచ్చిన వయోపరిమితి ఉత్తర్వులు రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ యాజమాన్యాన్ని పిలిపించి కార్మికులతో చర్చలు జరిపించి పరిష్కారం చేయాల్సిన బాధ్యత సూపరింటెండెంట్ వారిదేనన్నారు. జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరుతున్న సిఐటియు సభ్యులను అక్రమంగా విధులకు దూరం చేశారని తెలిపారు. తక్షణమే కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం కార్మికులతో చర్చలు జరపాలని, కార్మికుల డిమాండ్ లపై రాతపూర్వక ఒప్పందం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. చంద్రావతి మాట్లాడుతూ .... ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. 29 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్ లు తెచ్చి యజమానులకు, కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నారని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడాలని, అంగన్వాడీ యూనియన్ తరపున సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్. అమలత కూడా దీక్షలకు మద్దతు ప్రకటించారు. 3 వ రోజు దీక్షల్లో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ తో పాటు సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె. భాగ్యలక్ష్మి, శేరి దుర్గ, పోతుల దేవి, శేరి శివగంగ లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు లతో పాటు చెక్కా ధర్మారావు, అప్పన్న, బాలరాజు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, సోమరాజు, షఫీ ఖాన్, తదితరులు పాల్గన్నారు.

## మెడికల్ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

**అనంతపురం, పతాకం న్యూస్:** స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్, అనంతపురం పొల్యూషన్ బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ శంకర్ మాట్లాడుతూ జీవ వ్యర్థాల నిర్వహణ పైన అవగాహన అత్యంత అవసరమని, మెడికల్ విద్యార్థులు వ్యర్థాలను తగ్గిస్తూ, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పచ్చదనం పరిశుభ్రత స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర పైన గౌరవ ముఖ్యమంత్రి గారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు అభినందనీయమని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ తెలుగు మధు మాట్లాడుతూ శుభ్రత శరీరానికి మాత్రమే కాదని పరిసరాలకు కూడా అవసరమని తెలిపారు. పొల్యూషన్ బోర్డ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శశికళ మాట్లాడుతూ కళాశాలలో, ఆఫీసులలో వ్యర్థల యొక్క నిర్వహణ ఏ విధంగా ఉండాలి, పరిసరాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, వాతావరణ కాలుష్యాన్ని ఏ విధంగా తగ్గించాలి అనే దానిపై




సోదాహరణంగా వివరించారు. తర్వాత మెడికల్ కళాశాలలో డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు,వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర నోడల్ ఆఫీసర్ ఆచార్య డాక్టర్ ఎస్ ఉమామహేశ్వరరావు, సీనియర్ డాక్టర్లు డాక్టర్ భవాని, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శ్రీనివాసులు,డాక్టర్ నాగ ప్రవీణ్, డాక్టర్ షహజీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ లలిత భవాని

## సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద నిఘా ముమ్మరం




**జీలుగుమిల్లి, పతాకం న్యూస్:** ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తాటియాకులగూడెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్టు పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరావు చెప్పారు. సీఐ వెంకటేశ్వరావు, ఎస్సైలు క్రాంతికుమార్, సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీలు చేశారు. సరిహద్దు ప్రాంతం మీదుగా అక్రమం గా ఇసుక, గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం, అక్రమ బియ్యం, పశు వుల తరలింపు, చికెన్ వ్యర్థాల తరలింపు వాహనాలు రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పోలీస్ తనిఖీలు ఉంటాయని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చెక్‌పోస్టును ఎత్తివేయగా మరలా రెండేళ్ల అనంతరం ఇక్కడ చెక్‌పోస్టును ప్రారంభించడం గమనార్హం.

## స్వచ్ఛ ఆంధ్రకు కలిసికట్టుగా కృషి చేయాలి



**చీరాల, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు మరియు అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండలంలోని గ్రామపంచాయతీలో నిర్వహించిన సాస ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత అవగాహన కల్పిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి వేటపాలెం మెయిన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందని దీన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు.

## ఆసుపత్రిలో అవస్థలు



**కురుపాం, పతాకం న్యూస్:** కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రోగులు, వైద్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో 30 పడకలతో ఉన్న ఆసుపత్రిని 50 పడకలతో సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేశారు. అందుకు తగ్గట్టుగా వైద్యు లను నియమించారు. అయితే అదనపు గదులు లేకపోడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం డాక్టర్లందరూ ఒకే రూమ్‌లో ఉండాల్సి వస్తోంది. మరో గదిలో రోగులందరికీ వైద్యపరీక్షలు చేయాల్సి వస్తోంది. వాస్తవంగా కురుపాం సీహెచ్‌సీకి రోజుకు సుమారు రెండు వందలకు పైబడి రోగులు వస్తుం టారు. సోమ, గురువారాల్లో అయితే ఆసుపత్రి కిటకిటలాడుతుంది. అదే సీజనల్‌లో అయితే ఈ సంఖ్య రెట్టింపవుతుంది. కాగా ఆసుపత్రిలోని ఒక వార్డులో పది బెడ్‌లు మాత్రమే ఉండగా.. వరండాలో మరో పది బెడ్స్ వేసి ఇన్‌పేషెంట్లకు చికిత్స అందిస్తున్నారు. అయితే రోగుల తాకిడి ఎక్కువైతే ఇంక అంతే సంగతి. ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురేసి రోగులు సర్దుకోవాల్సిన దుస్థితి. గతంలో సీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేసినా.. నేటికీ అది అందుబాటులోకి రాలేదు. రెండేళ్ల కిందటే 90 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులు చేయకుండా చేతులెత్తేశారు. అయితే ఈ విషయం ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి రావడంతో ఉపాధి హామీ నిధులతో కొంతవరకు కాలువ పనులు చేయించారు. భవన నిర్మాణం కూడా వెంటనే పూర్తి చేయాలని ఇంజనీంగ్ అధికారులను ఆదేశించారు. మొత్తంగా అదనపు భవన నిర్మాణం పూర్తికాక.. సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, రోగులకు అవస్థలు తప్పడం లేదు. తక్షణమే పనులు పూర్తిచేసి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**బొండపల్లి, పతాకం న్యూస్:**మండలంలోని గరుడుబిల్లి రైల్వే పట్టాలను దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ప్రమా దానికి సంబంధించి బొబ్బిలి జీఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన ఈర్లి శ్రీరాములు(55) గరుడుబిల్లి వద్ద గల రైల్వే ట్రాకును దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు మృత దేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలిం చారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## గ్యాస్ పంపిణీలో గందరగోళం



**అనంతపురం, పతాకం న్యూస్:** బొమ్మనహాళ్ మండలకేంద్రంలో పోలీసుల సమక్షంలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. మండలంలో వంట గ్యాస్ సమస్య రోజురోజుకు మరింత తీవ్రమవుతోంది. గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసినప్పటికీ సకాలంలో అందకపో వడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజన్సీ నిర్వాహుకు లు డెలివరీ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని దేవరిగి క్రాస్‌కు చెందిన ఓ వినియో గదారుడు గత శు క్రవారం ఇండేన గ్యాస్ కోసం బుక్ చేయగా 24 గంట ల్లో డెలివరీ అయితే రోజులు గడిచినా సిలిండర్ అందలేదు. గురువారం బొమ్మన హాళ్‌కు వచ్చిన డెలివరీ బాయ్‌ను సంప్రదింగా రిజెక్ట్ అయిం ది. మరో సారి బుక్ చేయండి. రెండు రోజుల తర్వాత ఇస్తాను అని చెప్పడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు ఇలాంటి సమస్యలు పలువురు వినియోగదారులకు ఎదురవు తున్నాయని తెలుస్తోంది. బుక్ చేసినా గ్యాస్ అందకపోవడం, డెలివరీలో ఆలస్యం, సరైన సమా చారం ఇవ్వకపోవడం వంటి అంశాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం బొమ్మనహాళ్‌లో పోలీస్‌స్టేషన ఎదురుగానే పోలీసుల సమక్షంలో ఇండేన గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. దేవగిరి క్రాస్‌కు చెందిన ఆ వినియో గదారుడు కూడా అక్కడికి వెళ్లి పోలీసుల సమక్షంలోనే సిలిండర్ తీసుకోవాల్సి వచ్చింది.

## రాజంపేటను సుందరీకరణ చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**కడప, పతాకం న్యూస్:** రాజంపేట ను సుందరీకరణ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. చెత్త అంటే కేవలం పనికిరాని వస్తువు మాత్రమే కాదని, చెత్త నుంచే సంపద సృష్టించవచ్చన్న నూతన ఆలోచన విధానం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని ఆయన అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన "జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చమర్తి జగన్ మోహన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను, ఇతర సంస్థలను జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్లు గా మార్చడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని తెలియజేశారు. ఈ దిశగా ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమన్నారు.

# అధిక బరువుతో అనేక అనారోగ్య సమస్యలు!

మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు రావడానికి గల కారణాల్లో ఒకటి అధిక బరువు అన్న సంగతి అందరికీ తెలిసిందే. చాలా మందికి బరువు తగ్గితే ఈ సమస్యలు తగ్గుతాయి అనే భావన ఉంది. నిజానికి ఆరోగ్యకరమైన బరువును నిలుపుకోవడం ఉపయోగకరమే. అయితే ఆధునిక పరి శోధనలు ఈ సమస్యల వెనుక మరో కీలక కారణం దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ (వాపు) ఉందని చెబుతున్నాయి. ఈ మెటాబాలిక్ ఇన్‌ఫ్లమేషన్ చాలా నిశ్శబ్దంగా, తక్కువ స్థాయిలో కొనసాగుతూ ఉంటుంది. ఇది మనకు ప్రత్యక్షంగా అనిపించకపోయినా, శరీరం చక్కెరను ఎలా ప్రాసెస్ చేస్తుంది, కొవ్వును ఎలా నిల్వ చేస్తుంది, రక్తనాళాలను ఎలా రక్షిస్తుంది అనే ప్రక్రియలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం అనేక వైద్య సంస్థలు, మార్గదర్శకాలు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను మెటబాలిక్ వ్యాధులకు ప్రధాన కారణంగా గుర్తిస్తున్నాయి. మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె వ్యాధులు పరస్పరం బలమైన సంబంధం కలిగినవే. ఇవి తరచూ కలిసి అభివృద్ధి చెందుతాయి, ఎందుకంటే వీటి మెటబాలిక్ మార్గాలు ఒకే విధంగా ఉంటాయి. ఇందులో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి అవసరమైనదానికంటే ఎక్కువగా శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లు, చక్కెరలు, అధిక కేలరీలు తీసుకుంటే, లివర్ ఆ అదనపు శక్తిని కొవ్వుగా మారుస్తుంది. కాలక్రమేణా ఈ కొవ్వు లివర్ కణాల్లో పేరుకుపోయి ఫ్యాటీ లివర్‌కు దారితీస్తుంది. ఫ్యాటీ లివర్ కేవలం కొవ్వును నిల్వ చేయడమే కాకుండా, శరీరంలో



ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే రసాయన సంకే తాలను విడుదల చేస్తుంది. ఇవి ఇన్సులిన్ పనితీరును దెబ్బతీసి, రక్తంలో చక్కెర నియంత్రణలను కష్టతరం చేస్తాయి. దీంతో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి, ప్యాంక్రియాస్‌పై ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో రక్తనాళాల గోడలను కూడా ఈ ఇన్‌ఫ్లమేషన్ ప్రభావితం చేసి, గుండె వ్యాధులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

ఆహారం, జీవనశైలి ఇన్‌ఫ్లమేషన్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెరలు, మైదాతో చేసిన పదార్థాలు, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తరచూ పెరిగిపోతాయి. ఇది లివర్‌లో కొవ్వు నిల్వను పెంచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను మరింత తీవ్రతరం చేస్తుంది. దీనికి విరుద్ధంగా కూరగాయలు, పప్పులు, గింజలు, విత్తనాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇవి ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అందించి గట్ హెల్త్ (జీర్ణాశయ ఆరోగ్యం)ను మెరుగుపరుస్తాయి. అందుకే ప్రస్తుతం పోషకాహార సూచనలు కేవలం కేలరీలపై కాకుండా ఆహారం నాణ్యతపై దృష్టి పెడుతున్నాయి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మెటాబాలిక్ వ్యాధులు కేవలం అధిక బరువు ఉన్నవారిలోనే కాదు. ముఖ్యంగా దక్షిణాసియా ప్రజల్లో సాధారణ బరువుతో ఉన్నవారికీ ఫ్యాటీ లివర్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కనిపిస్తున్నాయి. అంటే మెటబాలిక్ ఆరోగ్యం కేవలం బరువుతో నిర్ణయించబడదు.

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి చిన్న చిన్న మార్పులు చాలా ఉపయోగపడతాయి. రోజువారీ జీవితంలో సులభంగా పాటించగల అలవాట్లు దీర్ఘకాల ప్రయోజనాలు ఇస్తాయి. మంచి ప్రోటీన్ తీసుకోవడం, పప్పులు, బీన్స్, సోయా, గుడ్లు, పాలు, గింజలు వంటి ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. మైదా, తీపి పదార్థాలను తగ్గించడం గ్లూకోజ్ స్పైక్స్‌ను తగ్గిస్తుంది. ప్రతి భోజనంలో ఫైబర్ కలిగిన ఆహారాలైన కూరగాయలు, పండ్లు, ధాన్యాలు తీసుకోవడం గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే విత్తనాలు, నట్‌లు, ఆలివ్ ఆయిల్, చేపలలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. రోజూ శారీరకంగా చురుకుగా ఉండటం, నడక వంటి వ్యాయామాలు చేయడం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కేవలం బరువు తగ్గడంపైనే దృష్టి పెట్టడం సరిపోదు. మెటాబాలిక్ ఆరోగ్యం కోసం జీవనశైలిని సమతుల్యం చేయడం అత్యంత ముఖ్యం. తక్కువ తినడం లేదా బరువు తగ్గడం మాత్రమే కాదు, శరీరం సక్రమంగా పనిచేయడానికి, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడానికి అవసరమైన అలవాట్లను అలవరుచు కోవడమే నిజమైన ఆరోగ్యానికి మార్గమని వైద్యులు చెబుతున్నారు.

# వెయ్యిమందికిపైగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్

## విద్యార్థులను వేధిస్తున్న కాలేజీ యాజమాన్యాలు!



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో సుమారు వెయ్యిమందికిపైగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదు. మరోవైపు ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయి. వెంటనే ఫీజు చెల్లించకపోతే క్లాసులకు రావద్దంటూ బెదిరిస్తున్నాయి. అప్పటికప్పుడు ఫీజులు చెల్లించుకోలేని తల్లిదండ్రులు అప్పులకోసం పరుగులు తీస్తున్నారు. ఇటు అప్పులు పుట్టక, అటు కాలేజీ యాజమాన్యాల వేధింపులు తట్టుకోలేక విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. ఇందులో ప్రభుత్వ నిర్లక్ష్యం కొంత, జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ సరిగాలేకపోవడం మరికొంతగా కనిపిస్తోంది. ఇంటర్ వరకు తల్లికి వందనం, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెట్ అమలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.... ప్రతి కాలేజీలోనూ కోర్సులను బట్టి ఫీజులు ఉంటాయి. ప్రభుత్వం నిర్వహించిన కౌన్సిలింగ్ ద్వారా జాయిన్ అయిన విద్యార్థుల్లో రూ.2.50లక్షల లోపు కుటుంబ వార్షిక ఆదాయం ఉన్న ప్రతి విద్యార్థీ అర్హులే. ఈ విధంగా జిల్లాలో 2024-2025 విద్యాసంవత్సరానికిగాను 48,880 మంది విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 47,830 మందికి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనెల 12వ తేదీ నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమవుతున్నాయి. వీరికి రూ.121కోట్లు మంజూరు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 1050మంది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మరోవైపు విద్యాసంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజు కోసం ఒత్తిడి పెరుగుతోంది. తక్షణమే ఫీజు చెల్లించాలని లేదంటే క్లాసులకు రావద్దని, పరీక్షలు రాస్తామన్న ఆశలు కూడా పెట్టుకోవద్దని వేధింపులు మొదలెట్టిన కాలేజీలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. ఈ విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నవారు కొందరైతే, ఆ అప్పులు కూడా పుట్టక, తమ పిల్లల్ని కాలేజీకి పంపలేకపోతున్నవారు మరికొందరు. ఇలా విద్యార్థుల వేదన, తల్లిదండ్రుల ఆవేదన వర్ణణాతీతంగా మారింది. ఫీజు రియింబర్స్‌మెంట్ ఆశ చూపించకపోతే తమ పిల్లల్ని చదువు మాన్పించేవారమంటూ కొందరు, ఎంబిబిఎస్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ వంటి కోర్సులో జాయిన్ చేయకుండా డిగ్రీతో సరిపెట్టేవారమంటూ మరికొందరు కంటతడి పెడుతున్నారు. సచివాలయాలపై పర్యవేక్షణ ఏదీ? మొత్తంగా పెండింగ్‌లోవున్న 1050 దరఖాస్తుల్లో గ్రామ సచివాలయాల పరిధిలోనే ఎక్కువ శాంతం పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థుల దరఖాస్తులన్నీ గ్రామ సచివాలయాల లాగిన్‌లోకి వెళ్తాయి. వార్షిక ఆదాయంతోపాటు మరో ఐదు అంచల పరిశీలన చేయాల్సివుంటుంది. దీని ప్రకారం ఆదాయ పన్ను చెల్లించినవారు, నాలుగు చక్రాల వాహనదారులు, ప్రభుత్వ ఉద్యోగం లేదా ఉద్యోగ విరమణ అనంతర పింఛను, పట్టణ ప్రాంతాల్లో 1500 ఎస్ఎఫ్‌టిలో సొంత ఇల్లు, 10ఎకరాల పల్లపు భూమి లేదా 25 ఎకరాల మెట్టభూమి ఉంటే దరఖాస్తు తిరస్కరించాలి. లేదంటే దాన్ని ఆమోదానికి సిఫార్సు చేయాలి. కానీ, 452 దరఖాస్తులను తిరస్కరణా చేయలేదు, ఆమోదానికీ పెట్టలేదు. దీన్నిబట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులపై సచివాలయాలు దృష్టిపెట్టలేదని అర్థమౌతోంది. కేవలం మ్యాపింగ్ కాకపోవడం వల్ల మరో 269 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచారు. మరో 329 దరఖాస్తులు కాలేజీ ప్రిన్సిపాల్స్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నట్టుగా సమాచారం. ఓవైపు విద్యాసంవత్సరం ముగింపు దశ, రేపో మాపో పరీక్షలు. వాటికి విద్యార్థులు సిద్ధమౌతున్న వేళ. ఇటువంటి సమస్యలను విద్యార్థులుగానీ, వారి తల్లిదండ్రులుగానీ జీర్ణించుకోలేకపోతున్నారు. సచివాలయాలు, కళాశాలలపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో ఫీజుల నియంత్రణతోపాటు వేధింపులు చేసినవారిపై చర్యలు తీసుకునేవారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# హార్ముజ్ జలసంధి మూసివేత



**ఇరాన్:** పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రం అవుతోంది. ట్రంప్ శాంతి చర్చలంటూనే అధనపు సైన్యాలను తరలిస్తున్నారు. మరోవైపు ఇజ్రాయిల్ నివాసాలే టార్గెట్‌గా దాడులు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ మిత్రదేశాలకు హార్ముజ్‌ను మూసేస్తున్నట్లు ఇరాన్ ఐఆర్‌జిసి శుక్రవారం ప్రకటించింది. శత్రువులతో కలిసుండే దేశాలకు ఏ మాత్రం అనుమతి ఇవ్వమని పేర్కొంది. ఇప్పటికే ఆయా దేశాలకు చెందిన మూడు నౌకలను కూడా వెనక్కి పంపేసినట్లు వెల్లడించింది. ఇక అమెరికా బలగాలు ఉన్న ప్రాంతంలోని పౌరులు దూరంగా వెళ్లిపోవాలని ఇరాన్ హెచ్చరించింది. గత నెల రోజులుగా జరుగుతున్న యుద్ధంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో హార్ముజ్ మూసివేతతో సంక్షోభం మరింత తీవ్రతరమవుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్ముజ్ జలసంధిని తెరవకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని ట్రంప్ బెదిరించిన సంగతి తెలిసిందే. ఇక ఇరాన్ ప్రాధేయపడడంతోనే చర్చల కోసం ఐదు రోజులు దాడులు ఆపేస్తున్నట్లు చెప్పిర ట్రంప్ తాజాగా ఆ గడువు కూడా ఏప్రిల్ 6 వరకు పెంచారు. అయితే అమెరికాతో ఎలాంటి చర్చలు లేవని ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్‌కు మిత్ర దేశాల నౌకలను అనుమతిస్తామని తెలిపింది. అమెరికా నిఘా సంస్థ ఎఫ్‌బిఐ చీఫ్ కాష్ పటేల్ వ్యక్తిగత ఈమెయిల్ హ్యాకింగ్‌కు గురైందన్న వార్త అంతర్జాతీయంగా సంచలనం సష్టిస్తోంది. ఇరాన్‌కు చెందిన హ్యాకర్ల బృందం ఈ పని చేసినట్లు స్వయంగా ప్రకటించుకుంది. ఏం జరిగిందంటే.. ఇరాన్‌తో సంబంధం ఉన్న 'హండాలా హ్యాక్ టీమ్' అనే హ్యాకర్ల సమూహం ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ వ్యక్తిగత ఇన్-బాక్స్‌ను హ్యాక్ చేసినట్లు ప్రకటించింది. తమ వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. 'విజయవంతంగా హ్యాక్ చేయబడిన బాధితుల జాబితాలో ఇప్పుడు కాష్ పటేల్ పేరు కూడా చేరుతుంది' అని హ్యాకర్లు ఎద్దేవా చేశారు. హ్యాకర్లు కేవలం ప్రకటన చేయడమే కాకుండా.. కాష్ పటేల్‌కు సంబంధించిన కొన్ని ఫోటోలను, ఆయన జీవిత విశేషాలకు సంబంధించి పత్రాన్ని కూడా ఇంటర్నెట్‌లో బహిర్గతం చేశారు. హ్యాక్ చేసిన డేటాలో 2010 నుంచి 2019 మధ్య కాలానికి సంబంధించిన వ్యక్తిగత , వృత్తిపరమైన ఈమెయిల్స్ ఉన్నట్లు సమాచారం.




# ఐపీఎల్‌లో అరుదైన రికార్డు కోసం ఇషాన్ కిషన్ ఎదురుచూపు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ప్రారంభం మ్యాచ్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఆర్సీబీతో జరగబోయే మ్యాచ్ ఇషాన్ కిషన్‌కు ఒక చారిత్రాత్మక మైలురాయి కానుంది. అంతేకాక ఐపీఎల్ చరిత్రలోనే తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించనున్నాడు. ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కు చాలా మంది భారత ప్లేయర్లు కెప్టెన్లుగా చేశారు. గతంలో శిఖర్ ధావన్ , మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ వంటి ఇతర ఇండియన్ ప్లేయర్లు ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించారు. ఇవాళ్టి మ్యాచ్‌తో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన తొలి భారత కెప్టెన్‌గా మాత్రం ఇషాన్ కిషన్ నిలవనున్నాడు. 27 ఏళ్ల 253 రోజుల వయస్సులో ఎస్ఆర్‌హెచ్‌కు ఇషాన్ కెప్టెన్ అయ్యాడు. అయితే ఎస్ఆర్‌హెచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అతి పిన్నవయస్కుడిగా రికార్డు మాత్రం న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ పేరిట ఉంది. అతడు 2018 సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో విలియమ్సన్ వయసు 27 ఏళ్ల 244 రోజులు. అతడి తర్వాత ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీకి నాయకత్వం వహించిన రెండవ అత్యంత పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా ఇషాన్ నిలవనున్నాడు. ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించిన అత్యంత పిన్న వయస్కుడైన తొలి భారత కెప్టెన్‌గా మాత్రం ఇషాన్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకోనున్నాడు. మరోవైపు కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించాలన్న జట్టు నిర్ణయంపై ప్రధాన కోచ్ డేనియల్ వెట్టోరి విశ్వాసం వ్యక్తం చేశారు. అతను ఆత్మవిశ్వాసం గల ఆటగాడిగా, ఇప్పటికే అతను వేరే టోర్నీల్లో కెప్టెన్‌గా తనను తాను నిరూపించుకున్నందున, అతనికి ఆ బాధ్యతను అప్పగించడంలో యాజమాన్యానికి పెద్దగా సంకోచం లేదని ఆయన పేర్కొన్నారు.

# బలహీనమైన బౌలింగ్‌తో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రాణించేనా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ే ప్రారంభమవుతున్న వేళ, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్టును చాలా కాలంగా వెంటాడుతున్న పాత సమస్యే మళ్లీ తెరపైకి వచ్చింది. సరికొత్త ఆటగాళ్లతో మరింత పదునెక్కిన విధ్వంసకర బ్యాటింగ్ లైనప్ ఒకవైపు ఆశలు రేపుతుంటే, మరోవైపు బలహీనమైన బౌలింగ్ యూనిట్ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ బౌలింగ్ బలహీనతను అధిగమించి ఈసారైనా టైటిల్ రేసులో నిలవగలరా అనే సందేహాలున్నాయి. ఆరెంజ్ ఆర్మీ ఈ సవాలును ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫిట్ నెస్ సమస్యలతో కొన్ని మ్యాచ్ లకు దూరంగా ఉండనున్నాడు. అతడి స్థానంలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించనున్నాడు. రేపు శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో సన్ రైజర్స్ తన తొలి మ్యాచ్ ఆడనుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ బలం గురించి మాట్లాడాలంటే ముందుగా ప్రస్తావించాల్సింది వారి బ్యాటింగ్ గురించే. టోర్నీలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటింగ్ లైనప్‌లలో ఒకటిగా సన్ రైజర్స్ నిలుస్తుంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ పవర్‌ప్లేలో ఎలాంటి బౌలింగ్ దాడినైనా చీల్చి చెండాడగలరు. వీరిద్దరూ ఆరంభంలో సృష్టించే విధ్వంసం జట్టుకు భారీ స్కోరు పునాది వేస్తుంది. మిడిల్ ఆర్డర్‌లో హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్ వంటి భయంకరమైన బ్యాటర్లు ఉన్నారు. వీరు కేవలం అధిక స్ట్రైక్ రేట్‌తో ఆడటమే కాకుండా, భారీగా పరుగులు సాధించగల సత్తా ఉన్నవారు. వీరికి తోడు ఈసారి లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్, సలీల్ అరోరా వంటి పవర్ హిట్టర్లు జట్టులోకి రావడం బ్యాటింగ్ విభాగానికి మరింత బలాన్ని చేకూర్చింది. ఈ లైనప్‌తో ఎంత పెద్ద లక్ష్యాన్నైనా ఛేదించగల, లేదా భారీ స్కోరును నిర్మించగల సత్తా సన్‌రైజర్స్‌కు ఉంది.

సన్ రైజర్స్ జట్టుకు అతిపెద్ద ఆందోళన వారి బౌలింగ్ విభాగమే. మహమ్మద్ షమీ జట్టును వీడటంతో పేస్ విభాగం కొంత బలహీనపడింది. ప్యాట్ కమిన్స్ నాయకత్వంలోని పేస్ దళంలో హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, శివమ్ మావి, బ్రైడన్ కార్స్ వంటి ఆటగాళ్లు ఉన్నప్పటికీ, అగ్రశ్రేణి జట్లలా స్థిరంగా వికెట్లు పడగొట్టే సామర్థ్యం వీరిలో ఎంతమందికి ఉందనేది ప్రశ్నార్థకమే.

స్పిన్ విభాగం పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. హర్ష్ దూబే, జీషన్ అన్సారీ, కమిందు మెండిస్ వంటి పెద్దగా అనుభవం లేని స్పిన్నర్లతో బరిలోకి దిగుతోంది. ముఖ్యంగా స్లో పిచ్‌లపై ఈ స్పిన్ బలహీనత జట్టుకు తీవ్ర సమస్యగా మారే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో బౌలర్లు విఫలమైతే, ప్రతీ మ్యాచ్‌లోనూ బ్యాటర్లపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఈ సీజన్‌లోనూ సన్‌రైజర్స్ తమ "అల్ట్రా-అగ్రెసివ్" బ్యాటింగ్ శైలిని పూర్తిగా నమ్ముకుని ఆడే అవకాశం ఉంది. బ్యాటింగ్‌లో ఉన్న లోతును ఉపయోగించుకుని భారీ స్కోర్లు సాధించడం ద్వారా ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టవచ్చు. బౌలర్లు కాస్త క్రమశిక్షణతో బౌలింగ్ చేసి తమ పాత్రలకు న్యాయం చేస్తే, చాలా మ్యాచ్‌లను కేవలం బ్యాటింగ్ బలంతోనే గెలవగల సత్తా సన్ రైజర్స్ కు ఉంది. లియామ్ లివింగ్‌స్టోన్ వంటి కొత్త ఆటగాళ్లు తమ సత్తా చాటి మ్యాచ్ విన్నర్లుగా మారేందుకు ఇదొక మంచి అవకాశం. అయితే, సన్‌రైజర్స్‌కు అతిపెద్ద ప్రమాదం వారి ఆటతీరే. పరిస్థితులకు తగ్గట్లు ఆడకుండా అతి దూకుడు ప్రదర్శించడం కొన్నిసార్లు బెడిసికొట్టవచ్చు. గత సీజన్‌లో ఇదే వ్యూహం కొన్ని కీలక మ్యాచ్‌లలో జట్టు ఓటమికి కారణమైంది. ముఖ్యంగా సమతూకంగా ఉన్న జట్లతో ఆడేటప్పుడు, బౌలింగ్ బలహీనత కారణంగా చివరి ఓవర్లలో మ్యాచ్‌లను చేజార్చుకునే ప్రమాదం ఉంది. ఒకవేళ ఏదైనా మ్యాచ్‌లో బ్యాటింగ్ విభాగం విఫలమైతే, ఆ స్కోరును కాపాడగల సత్తా ప్రస్తుత బౌలింగ్ యూనిట్‌కు లేదనేది వాస్తవం.




## 'కమిటీ కుర్రోళ్లు' దర్శకుడితో
# వరుణ్ తేజ్ కొత్త సినిమా




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన కెరీర్‌లో వేగం పెంచి వరుస ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నారు. ఇటీవల 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న యువ దర్శకుడు యదు వంశీతో తన కొత్త ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'బరి' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, వాలీబాల్ ఆట నేపథ్యాన్ని ప్రతిబింబించేలా ఓ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఈ సినిమాకు మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. ఆమె తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సొంత కుటుంబ సభ్యురాలి నిర్మాణంలో వరుణ్ తేజ్ నటించడం ఇదే తొలిసారి కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు యదు వంశీ తన తొలి సినిమా తరహాలోనే ఈ చిత్రాన్ని కూడా పూర్తి గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. పల్లెటూరి సహజత్వానికి, నేటివిటీకి పెద్దపీట వేస్తూ స్నేహం, కుటుంబ విలువలు, భావోద్వేగాల చుట్టూ ఈ కథ సాగనుందని సమాచారం. విజయవంతమైన యువ దర్శకుడు, విభిన్నమైన కథాంశం, కుటుంబ నిర్మాణ సంస్థ కలవడంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ మొదలైంది.

# ప్రభాస్ సినిమాలో రోల్..
# విమర్శలపై స్పష్టత ఇచ్చిన నటి రాశి



ప్రభాస్ సినిమాలో నటించడంపై తాను చేసిన వ్యాఖ్యల గురించి సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై సీనియర్ నటి రాశి స్పందించారు. ప్రభాస్‌కు తల్లి పాత్రలో తప్ప మరే ఇతర పాత్రలోనైనా నటించడానికి సిద్ధమేనని, సోదరి పాత్ర చేయనని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ అంటే ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా మాత్రం నటించనని రాశి చెప్పిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ప్రభాస్ సినిమాలకు గతంలో డబ్బింగ్ చెప్పినా, ఆయన్ను కలవలేకపోయానని కూడా ఆమె గతంలో పేర్కొన్నారు.

'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా 'అనుమాన పక్షి' తెరకెక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి వినగానే ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకున్నానని రాశి తెలిపారు. హీరోయిన్‌గా 148 సినిమాలు చేశానని, ఆ అనుభవంతో ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది ధీమాగా చెబుతున్నానన్నారు.




# ఏప్రిల్ 29న బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి!



టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పెళ్లి వార్తలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. డెస్టినేషన్ వెడ్డింగ్స్ హడావుడిలో ఉన్న నేటి కాలంలో, ఈ యువ హీరో మాత్రం ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలో అత్యంత నిరాడంబరంగా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం.

బెల్లంకొండ శ్రీనివాస్ తన మనసు గెలిచిన అమ్మాయి కావ్యను మను వాడ బోతున్నారు. ఈ నెల మొదట్లో జరిగిన ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లో ఆమెను పరిచయం చేసినప్పుడే అందరూ అది నిశ్చితార్థం అనుకున్నారు, కానీ అది కేవలం ఇరు కుటుంబాలు కలుసుకున్న సందర్భం మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు.

ఇక ఇప్పుడు పెళ్లికి సంబంధించిన కీలక తేదీలు బయటకు వచ్చాయి. ఏప్రిల్ 5న హైదరాబాద్‌లో బెల్లంకొండ శ్రీనివాస్ - కావ్యల నిశ్చితార్థం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 29న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా తిరుమలలో వీరిద్దరి వివాహం చాలా సింపుల్‌గా, కేవలం సన్నిహితుల సమక్షంలో జరగబోతోంది. మే 1న హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నాయకుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**